క్లుప్తంగా

ప్రతిభ మ్యాగజైన్ ఆవిష్కరణ



పత్రికను ఆవిష్కరిస్తున్న సిస్టర్ షైజీ తదితరులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ప్రతిభా మ్యాగజైన్ హిందీ సంచికను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆవిష్కరించారు. విద్యార్థినులైన రచయిత్రులకు పత్రిక కాపీలు అందించారు. వారి ప్రతిభ, నిబద్ధతను ప్రశంసించారు. ఎడిటర్, హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి, హిందీ శాఖ అధ్యాపకురాలు డాక్టర్ ఎస్.దీప్తి కృషిని ప్రిన్సిపాల్ షైజీ ప్రశంసించారు. గత 19 సంవత్సరాలుగా ప్రతిభ మ్యాగజైన్ విద్యార్థినుల సృజనాత్మకత వ్యక్తీకరణకు ఈ పత్రిక ఒక వేదికగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సిస్టర్లు నాన్సీ, మేరీ, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో మజ్జిగ పంపిణీ



వినియోగదారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న రైతులు

కంచరపాలెం: స్థానిక రైతుబజారులో శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకుని రైతులు మజ్జిగ పంపిణీ చేశారు. రైతుబజారు ఎస్టేట్ అధికారి జె.జగదీశ్వరరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో వినియోగదారులు, రైతులకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతులు, డ్వాక్రా మహిళలు, వినియోగదారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబకు జలాభిషేకం చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకు మాంబ అమ్మవారికి బుధవారం దేవస్థానం ఈవో జి.వి. రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. అర్చకుడు భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

దాబాగార్డెన్స్: అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు బుధవారం క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ ఎం. వీరభద్రరావు సహకారంతో కుట్టు మిషన్, 2 రైస్‌బ్యాగ్‌లు, నిత్యావసర సరుకులు, పిల్లలకు నోట్ బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ ఉషారాణి, అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, ఇంటర్నేషనల్ డైరెక్టర్ గాంధీ, జోన్ చైర్‌పర్సన్ ఎంవీవీకే గుప్తా, సలహాదారుడు వెంకట్‌రెడ్డి, కేబినేట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, శంకర్, ఇమంది ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీవో శ్రీలత

సీతమ్మధార: కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించినట్లు ఏసీడీపీవో శ్రీలత తెలిపారు. విశాఖ అర్బన్ పరిధి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు మే 2 నుంచి జూన్ 10 వరకు వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా బుధవారం నక్కవానిపాలెం జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కుమారి, బి.మమత, బి.శకుంతల, ఎన్.సాయి కుమారి, బి.గౌరి తదితరులు పాల్గొన్నారు.

భద్రత లేని బతుకులు



చేసే పనికి.. జీవితానికీ భద్రత లేని కాంట్రాక్ట్ కార్మికుడు



- భరోసా కానరాని జీవితాలు
- దినదిన గండంగా అసంఘటితరంగ కార్మికుల జీవనపయనం

నేడు మేడే



మా భద్రతకు భరోసా ఏదీ అంటున్న అసంఘటితరంగ కార్మికులు

దాబాగార్డెన్స్: ప్రపంచ కార్మిక దినోత్సవం అంటే కార్మికులందరికీ ఓ పండగ. కానీ లక్షలాది మంది కార్మికులకు మేడే అనేది జీవితంలో ప్రశ్నార్థకంగా మారింది. వేలాది మంది కార్మికులకు భరోసా లేని జీవితంగా.. భద్రత.. రక్షణ లేని వైనంగా ఉంది. ఉదయం నిద్ర లేచిన నాటి నుంచి రాత్రి పొద్దుపోయే వరకు తమ జీవితాలను పనులకే అంకితం చేసిన వారు కొందరైతే.. చేస్తున్న పనుల్లో ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని వారు మరికొందరు. రక్షణ.. భరోసా లేని జీవితాలు ఇంకొందరివి. ఆ కోవకు చెందిన వారే అసంఘటిత రంగ కార్మికులు. వీరికి హక్కులుండవు. చట్టాలు వర్తించవు. పనిచేసే ప్రాంతంలో రక్షణ ఉండదు. చివరికి వారి జీవితానికే గ్యారంటీ లేదు. ఇదీ మన అసంఘటిత రంగ కార్మికుల దీనగాథ.

పని చేసే ప్రాంతంలో..

పని చేసే ప్రాంతంలో ప్రమాదం సంభవించి కార్మికుడు మృతి చెందితే పట్టించుకునే నాథుడే కరువవుతున్నాడు. భవన నిర్మాణ కార్మికుడు బిల్డింగ్ పనులు చేస్తూ కింద పడి మృతి చెందితే కాంట్రాక్టర్ తప్పించుకుంటున్నాడు. వీరికంటూ బీమా లేకపోవడంతో మృతి చెందిన వ్యక్తి తాలూకా కుటుంబం రోడ్డు పాలవుతుంది. నష్టపరిహారం చెల్లించాల్సిన వారు నెమ్మదిగా తప్పుకుంటున్నారు. ఇంకేం భరోసా ఉంటుందని పలువురు అసంఘటిత రంగ కార్మికులు వాపోతున్నారు. అందుకు ఇటీవల జరిగిన పరిణామాలే నిదర్శనం.

లక్షలాది మంది కార్మికులకు భరోసా ఏదీ?

విశాఖ జిల్లావ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులకు భరోసా లేదు. వీరిలో దక్షిణ నియోజకవర్గ పరిధిలో వేలాదికి పైగా అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారు. నియోజకవర్గ పరిధిలో ఆటో రంగంలో 6 వేల మంది, ముఠా కార్మికులుగా 5 వేల మంది, భవన నిర్మాణ కార్మికులుగా 5 వేల మంది, ఇంటి పనివారిగా వెయ్యి మంది, కాంట్రాక్ట్ వర్కర్లుగా 2 వేల మంది, ప్రైవేట్ సెక్యూరిటీగా వెయ్యి మంది, పెట్రోల్ బంకుల్లో పని చేస్తున్న వారు 500 మంది, షాప్ వర్కర్స్ (వివిధ దుకాణాల్లో పని చేస్తున్న వారు) 5 వేలమంది.. వీరు కాక ఆశ, అంగన్‌వాడీ, మిడ్డే మీల్ వర్కర్లుగా వేలాది మంది పని చేస్తున్నారు. వీరికి పనిచేసే ప్రాంతంలో భద్రత.. రక్షణ ఉండదు. ఉద్యోగంలో భరోసా కానరాదు. చట్టాలున్నా పని చేయవు. హక్కులు ఉన్నా.. అమలుకావు. వీరిని ఎవరూ పట్టించుకోరు. ఎప్పుడైనా పని చేసే ప్రాంతంలో ప్రమాదం సంభవిస్తే పట్టించుకునే నాథుడే కరువు. మరీ ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించవు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ వంటి వాటికి వీరు నోచుకోరు. సెలవులు ఉండవు. బోనస్‌లు అసలే ఉండవు. మరీ ముఖ్యంగా కనీస వేతనాలు అంటూ అసలుండవ్. వీరి కోసం చట్టాలు ఉన్నప్పటికీ అవేవీ వీరికి వర్తించవు.

కనీస వేతనాలు అమలు చేయాలి



అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలంటూ మే 20న పెద్ద ఎత్తున దేశవ్యాప్త సమ్మె నిర్వహించనున్నాం. ఈ సమ్మెకు దేశంలో ఉన్న అన్ని కార్మిక సంఘాలు మద్దతునిస్తున్నాయి. అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గేట్ మీటింగ్‌లు నిర్వహించనున్నాం. సదస్సులు జరపనున్నాం.

–ఎం.జగ్గునాయుడు, సిటు నాయకుడు

బడా బాబులకు తొత్తులు..



ప్రభుత్వాలు బడాబాబులకు తొత్తులుగా మారాయి. కార్మిక శాఖ కార్మికుల సంక్షేమానికి కృషి చేయడం లేదు. కార్మికులకు పని చేసే ప్రాంతంలో ప్రమాదం సంభవిస్తే ఎవరూ పట్టించుకోవడం లేదు. సిటు కార్మికుడి తరఫున పోరాడి మృతి చెందిన కుటుంబానికి ఎంతో కొంత నష్టపరిహారం వచ్చేలా చేస్తుంది. – ఆర్.కె.ఎస్.వి.కుమార్, సిటు నాయకుడు

పూర్ణామార్కెట్ వద్ద పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు



పూర్ణామార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్‌పోస్ట్

జగదాంబ: పూర్ణామార్కెట్ వద్ద పోలీసు ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఎండా కాలం కావడంతో ట్రాఫిక్ పోలీసుల కోసం దీన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ర్యాష్ డ్రైవింగ్, డోంట్ డ్రింక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ వాడకంతో పాటు పలు ట్రాఫిక్ నిబంధనలు ప్రస్తావిస్తూ దీన్ని ఏర్పాటు చేశారు. మార్కెట్ ప్రధాన రహదారి, వన్‌టౌన్‌కు వెళ్లే దారిలో దీన్ని ఏర్పాటు చేయడంతో అందరినీ ఆకట్టుకుంటోంది.

కల్వర్టు నిర్మాణంతో ట్రాఫిక్‌కు అంతరాయం



టౌన్ కొత్తరోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న కల్వర్ట్

జగదాంబ: టౌన్ కొత్తరోడ్డు వద్ద ఓ ప్రధాన కల్వర్టు నిర్మాణంతో వన్‌టౌన్‌కు వెళ్లే వాహనాలకు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రాంతంలో కొంత కాలంగా కల్వర్టు నిర్మాణం కోసం ఓ ప్రధాన కల్వర్టును తవ్వి వదిలేశారు. ఇటీవల జీవీఎంసీ నిధులు విడుదల చేయడంతో మళ్లీ పనులు ప్రారంభం అయ్యాయి. అయితే కాంట్రాక్టర్ రహదారికి అడ్డంగా బారికేడ్ పెట్టి పనులు చేయడంతో టౌన్ కొత్త రోడ్డు వైపు ట్రాఫిక్‌ను మళ్లించారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బుధవారం కురిసిన వర్షానికి కాలువ మరింత లోతుకు కూరుకుపోవడంతో ప్రమాదకరంగా తయారైంది. కాంట్రాక్టర్ పనులు త్వరితగతిన పూర్తి చేయకపోతే కల్వర్టు నిర్మాణానికి తీసిన భారీ గొయ్యితో ప్రమాదాలు జరుగుతాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మేడే వేడుకల్లో పాల్గొన్న వామనమూర్తి తదితరులు

అల్లిపురం: డ్రైవర్లకు భారీగా జరిమానాలు విధించే 21,31 జీవోను రద్దు చేసి, డ్రైవ్లందరికీ పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి డిమాండ్ చేశారు. 139వ మే డే సందర్భంగా రైల్వేస్టేషన్ ఎదుట బుధవారం నిర్వహించిన మేడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటో కార్మికుడు కె. చంటి మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 1886 మే 1న అమెరికా దేశం చికాగో నగరంలో కార్మికవర్గం 8 గంటల పని విధానం అమలు చేయాలని పోరాడి అమరులైన అమర జీవులకు జోహార్లు అర్పించారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో బాబు అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెంచి డ్రైవర్లకు ఆహార భద్రత లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల హక్కులను హరిస్తే ప్రభుత్వాల పతనం తప్పదని హెచ్చరించారు. మే 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో ఆటో డ్రైవర్లు, మోటార్ వాహన డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాల కళ్లు తెరిపించాలని డ్రైవర్లకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మేడేని సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో సంఘం జిల్లా నాయకులు వై. వెంకటి, నాయకులు కె. అప్పలరాజు, ఎల్. పరశురాం, పిల్లా శంకర్, ఎస్. అనిల్, వి.సంతోష్, కె. రాము తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



రాంజీ ఎస్టేట్‌లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్ల కొమ్మలు

కంచరపాలెం: కంచరపాలెం పరిధి కప్పరాడ, రాంజీ ఎస్టేట్ కొండవాలు ప్రాంతాల్లో బుధవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బి.కె.నాయుడు ఆదేశాల మేరకు సిబ్బంది విరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు. పారిశుధ్య సిబ్బంది చెట్లకొమ్మలు తొలగించారు.

వైభవంగా వెంకన్న రాట మహోత్సవం



బల్లిగిరి వెంకన్న కల్యాణోత్సవానికి రాట వేస్తున్న అర్చకుడు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం సందర్భంగా బుధవారం దేవాలయం ఆవరణలో కల్యాణ రాట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు విశేష అభిషేకాలను నిర్వహించారు. ముందుగా ముత్తయిదువులు మేళతాళాలు, వేద మంత్రాల మధ్య ముహూర్తపు రాటకు పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు రఘునాథాచార్యులు మాట్లాడుతూ 7వ తేదీన అంకురార్పణ, 13వ తేదీన పుష్పాంజలి సేవతో కల్యాణోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. కల్యాణంలో పాల్గొనదలచిన భక్తులు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. 7వ తేదీ ఉదయం పంచామృతాభిషేకాలు, స్నపనం, తిరుమంజన సేవ, నూతన వస్త్రాలంకరణ, సాయంత్రం ఉత్సవ సంకల్పం, ఆరాధన, నివేదన, ఉత్సవ సంకల్పం ఉంటాయన్నారు. 8వ తేదీన ధ్వజారోహణం, రాజభోగం, నివేదన, సాయంత్రం స్వామి వారి తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు తెలిపారు. 10వ తేదీన హోమాలు, 12వ తేదీన వైశాఖ పూర్ణిమ సందర్భంగా శేషహోమం, పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రతీర్థం, సాయంత్రం ధ్వజావరోహణం, సహస్ర దీపాలంకరణ సేవ, నక్షత్రహారతి, సప్తహారతి ఉంటాయన్నారు. 13వ తేదీ సాయంత్రం శ్రీవారి పుష్పాంజలి ఉత్సవం, ఊంజల్ సేవ, పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. స్వామి వారి తిరుకల్యాణోత్సవంలో పాల్గొనదలచిన భక్తులు దేవస్థానంలో రూ.1116 చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

భారతీయ నృత్యానికి విశ్వవ్యాప్త ఆదరణ



శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో కళాకారులు

దాబాగార్డెన్స్: భారతీయ నృత్యానికి విశ్వవ్యాప్తంగా ఆదరణ ఉందని శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ అధ్యక్షురాలు పైడి రజని తెలిపారు. ఇంటర్నేషనల్ డ్యాన్స్ డే సందర్భంగా కాళీ మాతా మందిరం వద్ద శాస్త్రీయ నృత్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ నృత్యం అన్ని వర్గాల వారి ఆదరణ చూరగొంటుందన్నారు. దీనిని నేటి తరం ప్రోత్సహించాలన్నారు. ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వై. సోమలత మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల నృత్యం వైపు నేటి యువత మొగ్గు చూపుతుందన్నారు. చిరకాలం నిలిచేది శాస్త్రీయ నృత్యమేనన్నారు. పలు విశ్వ విద్యాలయాల్లో శాస్త్రీయ నృత్యంపై ఉన్న కోర్సులు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. ప్రముఖ శాస్త్రీయ నృత్య దర్శకురాలు లీలాజగస్ మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యానికి ఉన్న ఆదరణ ఎప్పటికీ చెరిగిపోదన్నారు. కార్యక్రమంలో పి. మౌనిక, కె. రుత్విక్, నేహానాయక్, లక్ష్మీ కార్తీక, డి. దక్షిత, ప్రణవ, గ్రీష్మ, దీక్షాశ్రీ, స్నేహాంజలి, భువనేశ్వరి, నృత్య దర్శకురాలు సౌందర్య సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

దాబాగార్డెన్స్: ఒరిస్సా స్టీవర్స్ షిప్పింగ్ కంపెనీ వ్యవస్థాపకుడు మహిమానంద మిశ్రా 72వ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆ సంస్థ ఉపాధ్యక్షుడు జె.కె.నాయక్ తెలిపారు. బుధవారం వన్‌టౌన్‌లో గల కంపెనీ కార్యాలయంలో రోటరీ బ్లడ్ బ్యాంకు సహకారంతో ఏర్పాటు చేసిన ఈ మెగా రక్తదాన శిబిరంలో 88 మంది రక్తం దానం చేసినట్లు తెలిపారు.

చందనోత్సవ భక్తులకు జీవీఎంసీ సేవలు



భక్తులకు మంచినీటిని అందిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



సింహాచలం కొండపై పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

అల్లిపురం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంలో పారిశుధ్య నిర్వహణతో పాటు తాగునీరు సమృద్ధిగా ఏర్పాటు చేసి భక్తులకు అవసరమైన సేవలను జీవీఎంసీ అందించిందని మేయర్ పీలా శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, తాగునీటి విభాగం పర్యవేక్షక ఇంజినీరు కె.వి.ఎన్.రవి పర్యవేక్షణలో పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా జరిగిందని పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి పర్యవేక్షణలో సహాయ వైద్యాధికారులు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్స్‌పెక్టర్లు, వార్డు సచివాలయ కార్యదర్శులు, 1350 మంది పారిశుధ్య కార్మికులు సేవలందించారని పేర్కొన్నారు. గురువారం కూడా పారిశుధ్య పనులు నిర్వహిస్తారన్నారు.

'నవ జీవన వైతాళికులు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కె.ఎస్.చలం, సాహితీవేత్తలు

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శత వసంతాల రచయిత్రి రాజమ్ కృష్ణన్ రచించిన 'నవ జీవన వైతాళికులు' పుస్తకావిష్కరణ సభ బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. బసు పోతన ఆహ్వానం పలకగా.. సభాధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు స్వాగతోపన్యాసం చేశారు. సాహితీవేత్త, నాటక కర్త పొలిమెరశెట్టి ఫ్రాన్సిస్ శ్రీశ్రీ జయభేరి కవితను వినిపించారు. అరసం 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎస్.హనుమంతరావు అరసం చరిత్రను వివరించారు. ముఖ్య అతిథి యూపీఎస్సీ పూర్వ చైర్మన్ ప్రొఫెసర్ కె.ఎస్. చలం పుస్తకాన్ని ఆవిష్కరించి, రచయితకు అభినందనలు తెలిపారు. పుస్తకంలోని మహిళల ఆర్థిక సమానత్వం గురించి మాట్లాడారు. విమర్శకుడు ఆచార్య చందు సుబ్బారావు కవితా శైలిని విశ్లేషించారు. ఏయూ తెలుగు శాఖ ప్రొఫెసర్ డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ పుస్తక సమీక్ష చేసి మాట్లాడుతూ దివంగత రాజమ్ కృష్ణన్ అనుభవాలు, అభిప్రాయాలతోపాటు గొప్ప అంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయన్నారు. మరో సమీక్షకురాలు అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.సుధ మాట్లాడుతూ రాజమ్ కృష్ణన్ రష్యాలో విహరించి, తన ఆలోచనలను పుస్తకంలో పొందుపరిచారన్నారు. ప్రచురణ కర్త మానవ హక్కుల వేదిక కార్యకర్త పోలిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ప్రజా నాట్య మండలి గురించి వివరించారు. సోషలిస్ట్ సమాజంలో మహిళా ఎలా ఉండాలో ఈ పుస్తకం చెబుతుందన్నారు. కార్యక్రమంలో కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు, సాహితీవేత్త డాక్టర్ డి.వి.సూర్యారావు, విశాఖ రచయితల సంఘం అధ్యక్షుడు అడపా రామకృష్ణ, రచయిత బండి సత్యనారాయణ, కథా రచయిత మేడా మస్తాన్ రెడ్డి, పద్యకవి సిహెచ్.చిన సూర్యనారాయణ, రాధారాణి, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు వాసుపల్లి సానుభూతి

దాబాగార్డెన్స్: ఇటీవల తిరుపతిలోనూ.. ఇప్పుడు సింహాచలం చందనోత్సవంలో చనిపోయిన మృతులకు పూర్తి బాధ్యత కూటమి ప్రభుత్వమే వహించాలని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. స్వామి దర్శనానికి వచ్చి మృత్యువాత పడడం అత్యంత బాధాకరమన్నారు. ఘటనపై పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు కోటి రూపాయల నష్టపరిహారం అందజేయాలన్నారు. ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి క్షతగాత్రులను, మృతుల కుటుంబాలను పరామర్శించారని వాసుపల్లి తెలిపారు.

'మల్లం' ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదుకు డిమాండ్



నిరసన తెలుపుతున్న దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పారావు తదితరులు

కంచరపాలెం: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లం గ్రామంలో జరిగిన దళితుల సాంఘిక బహిష్కరణపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు హెచ్చరించారు. ఈ ఘటనపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం మల్లంలో మూడు రోజుల పాటు దళితులను వెలివేసిన ఘటనపై జిల్లా అధికారుల తీరు సరి కాదన్నారు. విద్యుత్ ప్రమాదం వల్ల మరణించిన పల్లపు సురేష్ కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని, మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగమివ్వాలని కోరారు. దీనికి కారకులైన నిందితులను కాపాడుతున్న అధికారులపై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సేన సిటీ కన్వీనర్ గొల్లమాల మీన, నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారాం పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు గణేష్ నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయం 11వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శక్తి పంచాయతన పీఠం పీఠాధిపతి బ్రహ్మశ్రీ కాకర పర్తి సత్యనారాయణ మూర్తి, సౌభాగ్యలక్ష్మి 108 కలశాలతో ఆలయంలోని విగ్రహాలకు అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు చొపల్లి భాస్కరరావు, సహాయ అర్చకుడు వి.ఎస్.కుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ కార్యదర్శి ప్రకాష్‌రావు, గొర్లె కృష్ణ, టి.వెంకటరావు, పి.వి. రమణ, పి.ముత్యాలరావు, సీహెచ్ లక్ష్మణరావు, టి.శైలుకుమారి, కోటేశ్వరమ్మ, వెంకటలక్ష్మి, రత్న, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.